# రామనామ మహిమ

పూర్వం దండకారణ్యంలో ఒక మహర్షి ఉండేవాడు. ఆయన తన తపోమహిమచేత అప్పుడప్పుడు స్వర్గలోకానికి వెళ్లివస్తూ ఉండేవాడు. ఆయనకు ఒక కుమారుడు. ఆ బాలుడు తన తండ్రికి శుశ్రూష చేస్తూ అన్నివిద్యలు నేర్చుకొన్నాడు. ఆ అరణ్యంలో ఉండే మునులందరూ ఆ బాలుని ప్రతిభను చూచి ఆశ్చర్యపోయేవారు.

ఒకదినం మహర్షి స్వర్గానికి వెళ్లిన సమయంలో ఆ బాలుడు ఒక్కడే ఆశ్రమముదగ్గర ఉండగా ఒకడు అక్కడికి పరుగెత్తుకొంటూ వచ్చి, "మహర్షి ఎక్కడ" అని ఆ బాలుని ప్రశ్నించాడు.

"మా నాన్నగారు లేరు. భగవద్దర్శనం కొరకు స్వర్గానికి వెళ్లారు" అని మునికుమారుడు తెలిపాడు. అది విని ఆ వచ్చినవాడు చాలా దుఃఖపడి తన్నుతాను నిందించుకోసాగాడు. అప్పుడు బాలుడు జాలిపడి "నీవు వచ్చినపని ఏమిటో నాకు చెప్పు. నేను చేయగలిగినదయితే చేస్తాను" అని చెప్పాడు. అతడు మరింత విచారపడుతూ "మునిపుత్రా! నేనువచ్చింది చాలా పెద్దకార్యము. నీ చేత కాదు" అన్నాడు

మునికుమారుడు అతనిని ఓదార్చుతూ తిరిగి తిరిగి ప్రశ్నించగా. "నాకు బ్రహ్మహత్యా దోషము తగిలింది. దాని నివారణార్థము నేను మీ తండ్రిగారి దగ్గతికి వచ్చాను." అని అతడు తెలిపాడు.

"ఇంతేనా భయపడకు! నేను దానిని నివారిస్తాను నీవు పోయి నదిలో స్నానంచేసి శుచివైరమ్మ"ని మహర్షి పుత్రుడు అతనికి అభయమిచ్చాడు. ఆ ఆగంతుకుడు శుచియై వచ్చిన తర్వాత అతనికి ఆ బాలుడు రామనామం ఉపదేశించి ఇలా చెప్పాడు.

"నిష్కల్మషమైన మనస్సుతో ముమ్మారు ఈ మంత్రం జపించు నీపాపం నివారణ అవుతుంది."

## కప్పగంతుల రామకృష్ణ ప్రసాదు

అతడు జపించగానే బ్రహ్మహత్యాదోషం తొలగిపోయింది.

ఇదిచూచి అక్కడఉండే మునులందరూ ఆశ్చర్యపోయారు. "పట్టుమనిపదహారేళ్లయినా లేని ఈ మునిపుత్రుడు ఎంత మహిమశాలి? తండ్రిని మించిన పుత్రుడు ఈ సంగతి తెలుసుకొని మహర్షి ఎంత సంతోషం పొందుతారు" అనుకొన్నారు.

స్వర్గలోకంనుండి మహర్షి తిరిగి వచ్చిన పిదప మునులవల్ల జరిగిన విషయం పూర్తిగా తెలుసుకొన్నాడు ఆయన సంతోషం పొందక పోగా చాలా మనస్తాపం చెందాడు. వెంటనే పుత్రుని పిలిచి ఇలా అన్నాడు.

"అయ్యో! అనవసరంగా ఎంత పని చేశావురా! "శ్రీరామ" అని ఒక్కసారి ఉచ్చరిస్తేసరిపోయేదానికి మూడుసార్లు చెప్పించావా? నీకింకా జ్ఞానోదయం కాలేదు. నీవు నీచకులంలో జన్మించి రాముని దర్శించి పాపపరిహారం చేసుకో."

ఆ శాపము ప్రకారం ఆ బాలుడు మరుజన్మలో "గుహుడు"గా జన్మించి శ్రీరాముని సందర్శించి, చేతయినంతసేవ చేసి తన జన్మ సఫలముచేసుకున్నాడు. ★

కాలేజీ విద్యార్థులంతా తమ సైన్సు ప్రొఫెసర్ గారితో గ్రామాలకి 'ఎక్స్కర్షన్' వెళ్ళారు. త్రోవలో ఒక మట్టియింటి గోడదగ్గరగా వెళ్ళి ఆశ్చర్యంతో ప్రొఫెసర్ గారు అట్టే నిలచిపోయారు. వెంట వస్తూన్న విద్యార్థులు "ఏమండీ ప్రొఫెసర్ గారూ! అలా గోడవైపే చూస్తూ నిలబడిపోయారేం?" అని అడిగారు.

"అదికాదు ఈఊరి పశువులు యిలా క్రమం తప్పకుండా ఈగోడమీద యీ విధంగా పేడ ఎలా వేయగలిగాయోనని ఆలోచిస్తున్నా" అన్నారు.

జి. వి. రమణమూర్తి, బీగంపేట.